# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 17-03-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించే 'దివ్యాంగ శక్తి' పథకాన్ని రేపు ప్రారంభించనున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.**

2. **రాష్ట్రంలో ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్న మంత్రి పి. నారాయణ.**

3. **రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్న ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్.**

4. **రాష్ట్రంలో నీటిపారుదల వ్యవస్థను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించిన జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు.**

==========================

ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించే 'దివ్యాంగ శక్తి' పథకాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు ప్రారంభించనున్నారు. గుంటూరుజిల్లా మంగళగిరి నియోజకవర్గంలో ముఖ్యమంత్రి ఈ పథకాన్ని ప్రారంభిస్తారని అధికారులు తెలిపారు. స్త్రీశక్తి పథకం కింద పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్‌లలో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయాన్ని ప్రభుత్వం కల్పిస్తోందని, దివ్యాంగ శక్తి పథకం కింద దివ్యాంగులకు ఆయా బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయాన్ని కల్పిస్తోందని చెప్పారు. నాన్ స్టాప్, అల్ట్రా డీలక్స్, సప్తగిరి ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో దివ్యాంగులకు ఇప్పుడున్నట్లుగానే 50 శాతం రాయితీతో ప్రయాణించే సదుపాయం కొనసాగుతుందని తెలిపారు.

-------------------------

రాష్ట్రంలో ప్రతి ఇంటికీ వచ్చే రెండేళ్లలో స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు . విశాఖపట్నంలోని గాజువాకలో మంత్రి పర్యటించి పలు అభివృద్ధి పనులను ఈ రోజు ప్రారంభించారు. హెచ్‌బీ కాలనీలో అల్లూరి సీతారామరాజు పార్కును ప్రారంభించారు. అనంతరం గాజువాక వ్యర్థ నిర్వహణ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ, విశాఖపట్నం మెట్రో రైలు ప్రాజెక్టుపై కేంద్ర ప్రభుత్వం నివేదిక వచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటామని తెలిపారు. 5 వేల కోట్ల రూపాయలతో రాష్ట్రంలోని నగరపాలక సంస్థల్లో మురుగునీటి

వ్యవస్థ, మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్..30 సెకన్లు

-------------------------

రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే ప్రభుత్వ లక్ష్యమని ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరి సమీపంలోని చినకాకానిలో ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్ మెంట్ బోర్డు-స్వారాజుణదీ నూతన కార్యాలయాన్ని ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూ, పెట్టుబడులను ఆకర్షించడంలో, రాష్ట్ర పారిశ్రామిక వృద్ధిని పర్యవేక్షించడానికి ఎకనామిక్ డెవలప్ మెంట్ బోర్డు కీలకమని తెలిపారు. ప్రభుత్వ విధానాల ద్వారా ప్రపంచ ప్రఖ్యాత సంస్థలు పెట్టుబడులకు రాష్ట్రాన్ని ఎంచుకున్నాయని చెప్పారు. 20 నెలల కాలంలో రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు సాధించామని మంత్రి వివరించారు.

-------------------------

అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలంలో ఈ నెల 23వ తేదీన జరగనున్న ఉక్కు కర్మాగారం శంకుస్థాపన కార్యక్రమం ఏర్పాట్లను హోం మంత్రి వంగలపూడి అనిత అధికారులతో కలిసి నిన్న పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కె పవన్ కళ్యాణ్, ఈ కార్యక్రమంలో పాల్గొంటున్న నేపథ్యంలో అధికారులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తూ అన్ని శాఖలు సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని హోం మంత్రి అనిత సూచించారు.

-------------------------

గృహ అవసరాలకు వంట గ్యాస్ సిలిండర్లు సమయానికి అందడం పట్ల పలువురు ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గ్యాస్ కోసం నమోదు చేసుకున్ననిర్ణీత సమయంలోనే సిలిండర్ అందిందని తమకు ఎలాంటి ఇబ్బంది కలగలేదని చెబుతున్నారు. గ్యాస్ సరఫరా విషయంలో అపోహలు, వదంతులు వ్యాపిస్తున్న నేపథ్యంలో వాటిని వినియోగదారులు నమ్మవద్దని బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలుకు చెందిన రమ్య, అనంతపురం జిల్లా కనేకల్ గ్రామానికి చెందిన రోజా తెలియజేస్తూ..

వాయిస్ ..30..సెకన్లు

-------------------------

రాష్ట్రంలో నీటిపారుదల వ్యవస్థను బలోపేతం చేసేందుకు నిర్వహణ, మరమ్మతుల పనులను వేగవంతం చేయాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులను ఆదేశించారు. నీటిపారుదల ప్రాజెక్టుల పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో విజయవాడ క్యాంపు కార్యాలయం నుంచి దృశ్యమాధ్యమం ద్వారా ఈ రోజు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఖరీఫ్ సీజన్‌కు ముందే ప్రాజెక్టులు, కాలువలను పూర్తి స్థాయిలో సిద్ధం చేయాలని సూచించారు. మే 15 నాటికి అన్ని అత్యవసర పనులను నాణ్యతతో పూర్తి చేసి సాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని చెప్పారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని చెరువుల్లో పూడిక తీసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని శాఖలతో సమన్వయంతో పనిచేసి నీటిపారుదల వ్యవస్థను సమర్థవంతంగా తీర్చిదిద్దాలని మంత్రి నిమ్మల రామానాయుడు సూచించారు.

-------------------------

రాష్ట్రంలోని ఇమామ్‌లు, మౌజన్‌లకు రంజాన్ సందర్భంగా గౌరవ వేతనాల బకాయిల చెల్లింపుల కోసం

ప్రభుత్వం 45 కోట్ల రూపాయలను ఈరోజు విడుదల చేసింది. ఇఫ్తార్ విందులో నిన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు నిధులు విడుదల చేసినట్లు ప్రభుత్వం తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 10 వేల మంది ఇమామ్‌లు, మౌజన్‌ల ఖాతాల్లోకి నేరుగా నగదు జమ చేసినట్లు పేర్కొంది. ఇందులో భాగంగా 5 వేల మంది ఇమామ్‌లకు 30 కోట్ల రూపాయలు, 5 వేల మంది మౌజన్‌లకు 15 కోట్ల రూపాయలు చెల్లించినట్లు అధికారులు వెల్లడించారు.

---------------------------

పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని బాపట్ల శాసన సభ్యులు వి.నరేంద్ర వర్మ రాజు తెలిపారు. బాపట్ల జిల్లాలోని పిట్టలవానిపాలెం మండల కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన ఈ రోజు సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించి, రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలను గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్య సిబ్బంది, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేంద్ర వర్మ మాట్లాడుతూ, ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి సకాలంలో వైద్యం అందాలని, అత్యవసర సేవల విషయంలో అలసత్వం వహించవద్దని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఆసుపత్రికి నిధులు మంజూరు చేయించి మరింత ఆధునీకరిస్తామని హామీ ఇచ్చారు.

---------------------------

అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఈ నెల 25వ తేదీ వరకు ప్రతి రైతు సేవా కేంద్రం పరిధిలో "రైతన్నా మీకోసం" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు రవి తెలిపారు. అనంతపురం జిల్లాలోని బుక్కరాయ సముద్రం కొట్టాలపల్లి గ్రామంలో ఈరోజు జరిగిన "రైతన్నా మీకోసం" కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వ్యవసాయంలో మెలకువలు, ఏ సమయంలో, ఏ పంటలు వేసుకోవాలి, ప్రకృతి వ్యవసాయం పద్ధతులు వంటి అంశాల గురించి రైతులకు ఈ కార్యక్రమంలో వివరించడం జరుగుతుందన్నారు. అలాగే రైతుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు, పథకాలపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని తెలియజేశారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 132 వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 టోల్ ఫ్రీ నెంబర్‌కు, మై జి.ఓ.వి డాట్ ఇన్ వెబ్‌సైట్, నరేంద్రమోదీ యాప్‌కు ఈ నెల 27వ తేదీ వరకు పంపవచ్చు.

---------------------------

నగరపాలక సంస్థల్లో ఆస్తి పన్ను చెల్లింపు బకాయిలపై వడ్డీలో 50 శాతం రాయితీ కల్పిస్తూ ప్రభుత్వం నిన్న ఉత్తర్వులు జారీ చేసింది. ఆస్తి పన్ను బకాయిలు పెరిగిపోయిన నేపథ్యంలో బకాయిల చెల్లింపుల కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఈ మేరకు మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. దీని ప్రకారం ఈ నెల 31 తేదీలోపు బకాయిలు పూర్తిగా చెల్లించిన వారికి వడ్డీలో 50 శాతం రాయితీ లభిస్తుందని, ఇప్పటికే వడ్డీతో కలిపి పన్ను చెల్లించిన వారికి తదుపరి బిల్లులో మినహాయింపు మొత్తాన్ని సర్దుబాటు చేస్తామని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

=====================